
సాక్షి గుంటూరు

గురువారం । 24 । ఆగస్టు । 2023

I




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1855 క్యూసెక్కులు వదిలారు.



నిమ్మకాయల ధరలు

తెనాలి : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో బుధవారం టిక్కీ నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,000, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 521.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరునికి పూజలు



నరసరావుపేట రూరల్: చంద్రయాన్–3 ప్రయోగం జయప్రదం కావాలని కోరుతూ కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భారతదేశ ఖ్యాతిని పెంచేలా ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగానికి త్రికోటేశ్వరుని ఆశీస్సులు అందించాలని అర్చకస్వాములు ప్రార్థించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకస్వాములు కిరణ్‌కిషోర్‌శర్మ, ఫణీంద్ర, కె.సత్యనారాయణ, శివాజీ, అనిల్ సాయిశర్మ పూజల్లో పాల్గొన్నారు.

తెనాలిలో 35.8 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా తెనాలి మండలంలో 35.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా తాడికొండ మండలంలో 1.2 మి.మీ వర్షం పడింది. సగటున 7.4 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. దుగ్గిరాల మండలంలో 28.6 మి.మీ., కాకుమాను 24.6, కొల్లిపర 15.6, చేబ్రోలు 12.8, పెదకాకాని 5, ఫిరంగిపురం 3, గుంటూరు పశ్చిమ 2.4, తుళ్ళూరు 1.8, గుంటూరు తూర్పు 1.6, తాడేపల్లి మండలంలో 1.4 మి.మీ చొప్పున వర్షం పడింది. ఆగస్టు మాసం 23వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 122.8 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 89.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

యార్డుకు 33,805 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 33,805 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 33,299 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,800 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.12,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 25,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,971 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాదియాకు సత్కారం



తాడేపల్లిరూరల్: అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించిన వడ్డేశ్వరం కేఎల్‌యూ విద్యార్థిని షేక్ సాదియా భారత్‌కు తిరిగి వచ్చిన సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య ఆధ్వర్యంలో గన్నవరం విమానాశ్రయం వద్ద సాదియాకు ఘనస్వాగతం పలికి, అనంతరం యూనివర్సిటీలో ఆమెను ఘనంగా సత్కరించి మెమెంటోను అందజేసినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూఏఈలోని షార్జా వేదికగా జరిగిన ప్రథమ ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ యూనివర్సిటీలో ఎంబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పతకాలతోపాటు స్ట్రాంగ్ ఉమెన్ టైటిల్‌ను కైవసం చేసుకోవడంతో ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హనుమంతరావు, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్, వ్యాయామ అధ్యాపకులు సాదియాను అభినందించారు.



అక్షర నీరాజనం : ఇస్రో అక్షరమాల రూపంలో మాచర్ల మండలం కంభంపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ప్రదర్శన



విజయోత్సవం : నంబూరు వివా వీవీఐటీలో విద్యార్థుల ఆనందోత్సాహాలు



జెండా జయహే: గుంటూరు మాంటిస్సోరి స్కూల్లో..

ఆ చంద్రతారార్కం అబ్బురపడేలా..

వెన్నెలొలికే చందమామ నవ్వులు చిలికిందా.. మువ్వన్నెలై తారాతోరణం తళుకులీనిందా.. ఆసేతుహిమాచలం ఆనంద నాట్యమాడిందా.. జగమే నిబిడాశ్చర్యంతో నివ్వెరబోయిందా.. అన్నట్టు నింగీనేలా సంతోషమై పరవశించాయి. ఊరూవాడా ఉప్పొంగాయి. చంద్రయాన్–3 విజయోత్సవంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. జయహో ఇస్రో నినాదం మిన్నంటింది.

–సాక్షి, నెట్‌వర్క్



జయజయధ్వానం : గుంటూరులో విద్యార్థుల సంతోషం

చంద్రయాన్‌-3 విజయవంతం చారిత్రాత్మకం



గుంటూరు ఎడ్యుకేషన్: చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడం చారిత్రాత్మకమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా చెప్పారు. బుధవారం సాయంత్రం తన చాంబర్లో ఆమె చంద్రయాన్ –3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 విజయవంతం సువర్ణాక్షరాలతో లిఖించదగినదని పేర్కొన్నారు. ఇస్రో మరిన్ని ప్రయోగాలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జె.మోహనరావు, ఏఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్పెషల్ రూటే సపరేటు

- అవినీతిలో పోలీస్ స్పెషల్‌బ్రాంచ్
- ఆరోపణల నేపథ్యంలో ఇప్పటికే వీఆర్‌కు సీఐ
- మరో అధికారిపై సాగుతున్న విచారణ
- గుంటూరు, తెనాలి, పొన్నూరుల్లో పేకాటకు మద్దతుగా నిలిచిన అధికారులు
- సింగిల్ నంబర్ లాటరీ, గుట్కా, రేషన్ మాఫియాల నుంచి వసూళ్లు

సాక్షిప్రతినిధి, గుంటూరు: జిల్లా పోలీసు బాస్‌కు కళ్లు, చెవులుగా ఉండాల్సిన స్పెషల్‌బ్రాంచ్‌పై అవినీతి మరకలు అంటుకున్నాయి. అడ్డగోలుగా అవినీతి చేసి, కలిసి వాటాలు పంచుకున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో అధికారులు నెపాన్ని ఒకరిపైకి మరొకరు నెట్టుకుంటున్నారు. ఇదీ గుంటూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) దుస్థితి. ఇటీవల అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఎస్బీ సీఐ నరసింహారావును వీఆర్‌కు పంపగా, మరో ఉన్నతాధికారిని పక్కన పెట్టి ఆ స్థానంలో వేరేవారిని నియమించారు. వీరిపై విచారణ జరుపుతున్నారు. సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకుల నుంచి వసూళ్లే దీనికి కారణమని భావిస్తున్నారు. అయితే వీటన్నింటికంటే ముందు ముఖ్యంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో అక్కడి పోలీసు అధికారుల సహాయ సహకారాలతో పేకాట ఆడిస్తున్నారన్నదే ప్రధాన ఆరోపణ అని సమాచారం.

పేకాటకు అనధికార అనుమతులు

అసాంఘిక కార్యకలాపాలతోపాటు పోలీస్ స్టేషన్లలో జరిగే అవినీతిని స్పెషల్ బ్రాంచ్ నేరుగా జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లాలి. అయితే జిల్లాలో జరుగుతున్న అనేక అంశాలను జిల్లా బాస్ దృష్టికి తీసుకువెళ్లకుండా కప్పిపుచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా గుంటూరులోని పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పలు గెస్ట్‌హౌస్‌లలో ఒక అధికారి సహకారంతో పేకాట ఆడించారని సమాచారం. పొన్నూరు, తెనాలి ప్రాంతాల్లోనూ అక్కడి అధికారుల సాయంతో పేకాట శిబిరాల నిర్వహణకు అనుమతులు ఇచ్చినట్లు తెలిసింది. గత నెలలో ఓ పండగ రోజు పొన్నూరు పరిధిలో పేకాట ఆడించారనే ఆరోపణల నేపథ్యంలోనే సీఐను వీఆర్‌కు పిలిచినట్లు తెలుస్తోంది. అయితే ఆ ఒక్క రోజే పేకాట నిర్వహించారా లేదా ప్రతినెలా ఆడించారా అనేది విచారణలో తేలనుంది. ఇండెంట్లపై కూడా విచారణ చేస్తున్నారు.

కొన్నిరోజులుగా సిబ్బంది విచారణ

ఈ క్రమంలో కొద్ది రోజుల నుంచి జిల్లాలోని పలు సబ్ డివిజన్లల్లోని పోలీస్‌స్టేషన్లల్లో విధులు నిర్వర్తించే ఎస్‌బీ సిబ్బందిని దఫాల వారీగా ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. ఎప్పటి నుంచి ఎస్‌బీలో పని చేస్తున్నారు, ఇటీవల పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోటు చేసుకున్న పరిణామాలేంటి అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. ఇరవై రోజుల క్రితం ఎస్‌బీ కార్యాలయంలో విధులు నిర్వర్తించే హెడ్‌కానిస్టేబుల్ (పాత రైటర్)ను వీఆర్‌కు పంపించారు. పొన్నూరు నుంచి వచ్చిన ఓ కానిస్టేబుల్‌నూ అదే బాట పట్టించారు. పొన్నూరులో రహస్యంగా చేపట్టిన పేకాట శిబిరం విషయమై తెలిసి, సమాచారం ఇవ్వలేదనే ఆ కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపారు. ఇక కొద్ది నెలల క్రితం బదిలీపై వచ్చిన ఎస్‌బీ ఉన్నతాధికారికీ 'మరక' అంటించారనే చర్చ నడుస్తోంది. బుధవారం తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని సిబ్బందిని పిలిచి ఉన్నతాధికారులు మాట్లాడారు. అక్కడి పరిణామాలపైనా ఆరాతీశారు.

నర'హింస'రావు లీలలు..

స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పనిచేసిన నరసింహారావు లీలలపై ఎస్పీ సిబ్బంది బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. గుంటూరు జిల్లాలో సింగిల్ నంబర్ నిర్వహించే బడా వ్యాపారులంతా నెలనెలా కప్పం కట్టాల్సిందేనని సమాచారం. సీఐతోపాటు మరో అధికారి, కొందరు సిబ్బంది కుమ్మక్కై ఈ వ్యవహారం చక్కబెట్టినట్లు తెలిసింది. సీఐ వేధింపులు తట్టుకోలేని కొందరు ఆయనకు నర'హింస'రావుగా పేరు పెట్టారని చెబుతున్నారు. నెలవారీ మామూళ్ల వసూలుకు కింది స్థాయి సిబ్బందిని వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. నెలవారీ మామూళ్లలో సబ్‌డివిజన్ల పరిధిలోని పలువురు అధికారులకు కొంత ముట్టజెప్పినట్లు తెలుస్తోంది.

నువ్వంటే..నువ్వు

ఇప్పుడు ఎస్పీపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సీఐ నరసింహారావు, విచారణ జరుగుతున్న మరో అధికారి ఆ నెపాన్ని ఒకరిపై మరొకరు వేసుకుంటున్నట్టు సమాచారం. సిబ్బంది మాత్రం ఇప్పటి వరకూ ఈ శాఖలో జరుగుతున్న వ్యవహారాన్ని విచారణ అధికారి ముందు బయటపెడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ విచారణపైనా ప్రభావం చూపించేలా ఒత్తిళ్లు తీసుకువస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాన్ని జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకుని భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా అడ్డుకట్ట వేయవచ్చు.



జిల్లా బాస్ పక్కనే ఉన్నా..

నిత్యం జిల్లా బాస్ పక్కనే ఉంటూ ఇటువంటి అవినీతికి పాల్పడటం, ఆరోపణలు వెల్లువెత్తడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆయా స్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు, చేస్తున్న అవినీతిని ఎప్పటికప్పుడు ఆ స్టేషన్ పరిధిలోని స్పెషల్‌బ్రాంచ్ సిబ్బంది పంపించినప్పటికీ ఎస్పీ సీఐతో పాటు మరో వ్యక్తి కలిసి ఆ విషయాలు ఎస్పీ దృష్టికి వెళ్లకుండా నిలువరించినట్లు సమాచారం. దీంతో పాటు ఆయా స్టేషన్ అధికారులు, సిబ్బందిని పిలిపించి వారిని భయపెట్టి అక్రమ వసూళ్లకు పాల్పడేవారని తెలిసింది.

ఈ-క్రాప్.. రైతు సేఫ్

విత్తు నుంచి పంట విక్రయం వరకు రైతుకు ఇబ్బందులు ఎదురు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ–క్రాప్ నమోదును పకడ్బందీగా చేపడుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే బీమా ప్రీమియం చెల్లించకుండానే రైతులకు పరిహారం అందజేస్తోంది. మార్కెట్‌లో ధరలు పడిపోయిన సందర్భంలో 'మద్దతు' ఇస్తోంది. ఈ–క్రాప్ ఆధారంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతుకు భరోసా ఇస్తోంది.

- ఖరీఫ్ పంటల నమోదు ప్రారంభం
- జియో ఫెన్సింగ్ పద్ధతిలో ప్రక్రియ
- విధిగా పంట ఫొటో తీయాల్సిందే
- సెప్టెంబర్ 15 లోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు
- అన్నదాతలకు అన్ని రకాల ప్రయోజనాలు

కొరిటెపాడు(గుంటూరు) : జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 1,35,501 హెక్టార్లు ఉండగా.. ఇప్పటి వరకు 66,293 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. సాగు చేసిన ప్రతి పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేసే విధంగా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. వ్యవసాయ పంటలు, పండ్లు, కూరగాయల తోటలు, మిరప, మల్బరీతో పాటు షేడ్ నెట్‌ల కింద సాగులో ఉన్న పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేస్తున్నారు.

గత ఏడాది పంటల నమోదులో అనేక జాగ్రత్తలు తీసుకున్నా అక్కడక్కడా పొరపాట్లు దొర్లాయి. విధిగా రైతు పొలంలోకి వెళ్లి ఫొటో తీసి యాప్‌లోకి అప్‌లోడ్ చేయాల్సి ఉన్నప్పటికీ, ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు గ్రామం దగ్గరలోని పొలాల్లో రైతులను నిలబెట్టి ఫొటోలు తీసి మమ అనిపించారు. ఈ సారి ఇటువంటి వాటికి అవకాశం లేకుండా జియో ఫెన్సింగ్‌తో ఎంపిక చేసుకున్న సర్వే నంబర్లలో ఫొటో తీయాల్సి ఉంది. ఈ ఏడాది ఈ–క్రాప్‌కు ఎటువంటి ఎడిట్ (సవరణ) ఆప్షన్ లేదు. దీంతో పంటల నమోదులో అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది వెబ్‌ల్యాండ్ డేటా లింక్‌తో ఎన్‌ఐసీ సహకారంతో యాప్‌ను వ్యవసాయశాఖ రూపొందించింది.

ఇదీ కార్యాచరణ..

సెప్టెంబర్ 15వ తేదీ లోపు పంటల నమోదు పూర్తి చేసే విధంగా వ్యవసాయశాఖ కార్యాచరణ రూపొందించింది. సెప్టెంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు ఈ–క్రాప్‌లో నమోదు చేసిన వివరాలకు రైతుల ఈకేవైసీ తీసుకోవడం, ఏడీఏ, డీఏఓ, జేసీ, కలెక్టర్ సూపర్ చెక్ చేసిన తర్వాత సోషల్ ఆడిట్ నిర్వహించి రైతులకు డిజిటల్, మాన్యువల్ రశీదులు ఇవ్వాల్సి ఉంది. పంటను సులభంగా గుర్తించడానికి తగినంత ఎత్తు ఉందా లేదా గుర్తించి ఫొటో తీసే విధంగా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఆహార పంటలను ధాన్యాలుగా మార్పులు చేశారు. చిరుధాన్యాలలో జొన్న, సజ్జ, రాగి తదితర పంటలను చేర్చారు. రక్షిత సాగు (షేడ్ నెట్, పాలిహౌస్‌లో సాగు) పంటలను కూడా ఈ–క్రాప్‌లో నమోదు చేస్తారు. వరి పంట కాలం నారుమడి నుంచి పంట కోత వరకు ఉంటుంది. నాట్లు వేసిన రోజు నుంచి 25–30 రోజుల ముందు విత్తనం వేసినట్లుగా (డేట్ ఆఫ్ సోయింగ్) ఉండాలి.

రెండు శాఖల పర్యవేక్షణ..

ఈ ఏడాది పంటల నమోదును వ్యవసాయ, రెవెన్యూ శాఖలు పర్యవేక్షించనున్నాయి. గ్రామ స్థాయిలో ఆర్‌బీకే ఇన్‌చార్జులు నమోదు చేసిన డేటాను వీఆర్‌ఓలు ధ్రువీకరించాల్సి ఉంది. ఆ తర్వాత మండల వ్యవసాయ అధికారి లాగిన్‌కు, అక్కడి నుంచి తహసీల్దారు లాగిన్‌కు వివరాలు వెళ్తాయి. వెబ్‌ల్యాండ్ డేటాను ప్రామాణికంగా తీసుకోవడం వల్ల పొరపాట్లకు తావు లేకుండా ఉండేందుకు అవకాశం ఏర్పడింది.

వెబ్‌ల్యాండ్‌లో ప్రతి సర్వే నంబరుకు రైతు ఆధార్, మొబైల్ నంబరు అనుసంధానమై ఉంటుంది. ఈ–కర్షక్ యాప్‌కు ఆర్‌బీకేలు, రెవెన్యూ గ్రామాలను మ్యాపింగ్ చేశారు. యాప్‌లో రైతు ఆధార్ నంబరు నమోదు చేస్తే భూమి వివరాలు ప్రదర్శితమవుతాయి. సాగు వివరాలు నమోదు చేయడంతో పాటు క్షేత్ర స్థాయిలో పంట పాటో తీసి యాప్‌లోకి అప్‌లోడ్ చేస్తారు. సీసీఆర్ కార్డులు పొందిన సాగుదారుల వివరాలను కూడా యాప్‌లో అందుబాటులో ఉంటాయి. పంటల నమోదు పారదర్శకంగా ఉండేందుకు ఉన్నతాధికారులు తనిఖీలు చేయనున్నారు.



తెనాలి మండలం కంచర్లపాలెంలో పంట నమోదు చేస్తున్న దృశ్యం

వంద శాతం పారదర్శకత

పంటల నమోదులో వంద శాతం పారదర్శకత ఉండేందుకు ఈ సారి జియో ఫెన్సింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. జియోఫెన్సింగ్‌తో చేసిన ఈ–క్రాప్ బుకింగ్ ఏ విధంగా ఉంటుందనే దానిపై ఇప్పటికే అవగాహన కల్పించారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఈ–క్రాప్‌లో పంటల నమోదులో కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది ఈ ప్రక్రియను మరింత పకడ్బందీగా చేపడుతున్నాం. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పంటలను ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నాం. సెప్టెంబర్ 15 నాటికి పంటల నమోదును పూర్తి చేసి సెప్టెంబర్ 30వ తేదీ వరకు సోషల్ ఆడిట్, సూపర్ చెక్, ఈకేవైసీ నిర్వహించనున్నాం.

–నున్నా వెంకటేశ్వర్లు, డీఏఓ, గుంటూరు

ఆంధ్రకేసరి ఆదర్శనీయులు



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయులని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి కొనియాడారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో టంగుటూరి జయంత్యుత్సవం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు ధైర్యసాహసాలను కొనియాడారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువతకు ప్రకాశం పంతులు ఆదర్శమని పేర్కొన్నారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎస్ఐ అభ్యర్థులకు ఫిజికల్ పరీక్షలు

- గుంటూరు రేంజ్‌లో 12,957 మంది అభ్యర్థులు
- 11,048 మంది పురుషులు, 1,909 మంది మహిళలు
- గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో చురుగ్గా ఏర్పాట్లు



మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, చిత్రంలో గుంటూరు ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఎస్ఐ ఉద్యోగాల కోసం గుంటూరు రేంజ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 15 వరకు గుంటూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఫిజికల్ (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు జరగనున్నట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో బుధవారం రేంజ్ కార్యాలయ పరిధిలోని అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఐజీ మాట్లాడుతూ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఎస్ఐ ఉద్యోగాల నియమాకానికి చేపట్టిన ప్రాథమిక పరీక్షల్లో గుంటూరు రేంజ్ పరిధిలో 12,957 మంది అభ్యర్థులు అర్హత సాధించారని వెల్లడించారు. వీరిలో 11,048 మంది పురుషులు, 1,909 మంది మహిళలు ఉన్నట్టు వివరించారు. ఫిజికల్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిర్దేశిత ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరవ్వాలని సూచించారు. ఈనెల 30, 31, సెప్టెంబర్ 1న ప్రత్యేకంగా మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ తేదీల్లో వీలుపడని వారు అప్పీలు చేసుకునేందుకు వీలు కల్పించినట్టు చెప్పారు. నిర్దేశిత తేదీల్లో గైర్హాజరైన వారు చివరి రోజైన సెప్టెంబర్ 15న అప్పీలు చేసుకునేందుకు, హాజరయ్యేందుకు అవకాశం కల్పించనున్నట్లు ఐజీ వెల్లడించారు. సమావేశం అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఐజీ పరిశీలించారు. ఐజీ వెంట గుంటూరు ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, కె.కోటేశ్వరరావు (ఏఆర్) పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి భారతీయుడు గర్వపడేలా చంద్రయాన్‌-3

సత్తెనపల్లి: చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3ని విజయవంతంగా ల్యాండ్ చేసినందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తల బృందానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయవంతంగా ప్రయోగించి చంద్రుడిపై ఉన్న ఆసక్తికర అంశాలను మానవాళికి అందించడంలో ఇస్రో శాస్త్రవేత్తలు ముందడుగు వేశారన్నారు. చంద్రుడిపై నివాస యోగ్యత, నీటి లభ్యత, జీవరాసుల మనుగడకు సంబంధించిన సమాచారం ప్రపంచానికి చేరవేయడంలో భారతదేశం ముందుంటుందన్నారు. ఎన్నో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మారిన భారత శాస్త్రవేత్తలకు, శాస్త్రవేత్తలను ప్రోత్సహించిన భారత ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. శాస్త్ర సాంకేతిక, భౌగోళిక, చంద్రమండల, అంతరిక్ష రంగాల్లో భారత్ గణనీయమైన అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. 140 కోట్ల భారతీయుల కలను సాకారం చేసిన భారత శాస్త్రవేత్తలకు మరొక్కసారి శుభాభినందనలు తెలిపారు.

దేశానికి గర్వకారణం

కొల్లూరు: చంద్రయాన్–3 విజయవంతం కావడం దేశ ప్రతిభకు నిదర్శనంగా నిలిచిందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. బుధవారం చంద్రయాన్–3 చంద్రుని దక్షిణ ధ్రువంపై విజయవంతంగా ల్యాండ్ అవడంపై ఆయన కొల్లూరులోని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో స్పందించారు. ఆయన మాట్లాడుతూ, ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రయోగం విజయవంతం కావడంతో మన దేశ ప్రతిభా పాటవాలు ఏపాటివో ప్రపంచ దేశాలకు అవగతమైనట్లయిందని చెప్పారు. ఎన్నో దేశాలు సాధించలేని ఘనతను మన ఇస్రో శాస్త్రవేత్తల బృందం సాధించడం అభినందనీయమని చెప్పారు. చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడంలో నిమగ్నమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఆ ఇంట సరస్వతీ పుత్రికలు

- ఒకే ఇంట్లో రెండు ప్రభుత్వ ఉద్యోగాలు
- పారదర్శక పరీక్షలు, నిర్ణీత వ్యవధిలోనే నిర్వహణ నియామకాలతోనే ఉద్యోగాలంటున్న అక్కాచెల్లెళ్లు



తల్లిదండ్రులు దశరథరామిరెడ్డి, నాగమణితో అక్కాచెల్లెళ్లు తిరుమల ప్రశాంతి, స్రవంతిరెడ్డి

తెనాలి: ఆ అక్కాచెల్లెళ్లు సరస్వతీ పుత్రికలు. ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. పెద్దమ్మాయి సచివాలయంలో విమెన్ అండ్ వీకర్ సెక్షన్ సంరక్షణ కార్యదర్శిగా చేస్తుండగా, ఏపీపీఎస్సీ ఇటీవల నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల్లో రెండో అమ్మాయి ఏకంగా అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ ఉద్యోగాన్ని సాధించింది. ప్రభుత్వం షెడ్యూలు ప్రకారం పారదర్శకతంగా నిర్వహించిన పరీక్షల కారణంగానే ఓపెన్ కేటగిరీలో తొలి ప్రయత్నంతోనే ఉద్యోగాలు వచ్చాయని ఆ కుటుంబం ఆనందపడుతోంది.

తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ ఉద్యోగం

మారంరెడ్డి దశరథరామిరెడ్డి. తెనాలిలోని ఎన్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్త డిగ్రీ కాలేజీలో చరిత్ర అధ్యాపకులు. పక్కా కాంగ్రెస్‌వాది. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుండదన్న భావనతో 'కార్పొరేట్' అవకాశాలను కాదనుకున్నారు. ఆయన భార్య నాగమణి. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయి తిరుమల ప్రశాంతి. రెండో కుమార్తె స్రవంతి రెడ్డి. బీటెక్ చేశాక తిరుమల ప్రశాంతికి వివాహం చేశారు. భర్త బ్యాంకు ఉద్యోగి. తానూ బ్యాంకు పరీక్షలు రాద్దామని అనుకుంటుండగా, 2019లో రాష్ట్ర ప్రభుత్వం వార్డు/గ్రామ సచివాలయాల ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించింది. అదృష్టం పరీక్షించుకుందామని రాసిన తిరుమల ప్రశాంతికి మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం లభించింది.

స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా..

రెండోకుమార్తె స్రవంతిరెడ్డి. ఇంటర్ తర్వాత ఎంసెట్ రాశారు. నాలుగు వేల ర్యాంకుతో బీడీఎస్‌లో సీటు లభించింది. వైద్యవృత్తి కన్నా రైతుసేవ మంచిదన్న భావనతో, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ అనుబంధంగా గల బాపట్ల వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ బీఎస్సీలో చేరారు. 2019లో కాలేజీ, విశ్వవిద్యాలయం టాపర్‌గా నిలిచారు. యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, నాటి యూనివర్సిటీ వీసీ చేతులమీదుగా మూడు బంగారు పతకాలను స్వీకరించారు. సివిల్స్ రాద్దామని కోచింగ్‌కు వెళ్లినా కరోనాతో సాధ్యం కాలేదు. తర్వాత సొంతంగా తయారై రెండుసార్లు సివిల్స్ రాసినా, ప్రిలిమ్స్ గట్టెక్కలేదు. గత సెప్టెంబరులో ప్రభుత్వం గ్రూప్–1 పరీక్షలకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఏపీపీఎస్సీ నిర్వహించిన ఈ పరీక్షల్లో తొలి ప్రయత్నంలోనే ఆదీ ఓపెన్ కేటగిరీలో అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ పోస్టు రావటంతో మురిసిపోతోంది స్రవంతిరెడ్డి.

ప్రభుత్వ పారదర్శక విధానాల వల్లే..

ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవటం, అందులోనూ ఎలాంటి అక్రమాలు, అవినీతికి తావులేకుండా పారదర్శకంగా భర్తీ చేయటం గొప్ప విషయమని దశరథ రామిరెడ్డి అంటారు. తాను కాంగ్రెస్‌కి వీరవిధేయుడినని చెబుతూ, మధ్యతరగతి కుటుంబీకుడినైన తన బిడ్డలకు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించటం కష్టమన్న భావన ఉండేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మెరిట్‌కు ప్రాధాన్యత ఇస్తూ, సకాలంలో పరీక్షల నిర్వహణ, ఉద్యోగాల నియామకాలతో ఆ భావన తొలగిపోయిందన్నారు.

సంక్షేమపాత్రుడు ప్రకాశం పంతులు

- విప్లవాత్మక సంస్కరణలతో రాష్ట్రాభివృద్ధికి పాటుపడ్డారు
- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



అప్పిరెడ్డిని సత్కరిస్తున్న సంఘం సభ్యులు, డొక్కా, ఎమ్మెల్యే గిరి, మేయర్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, డొక్కా, ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ కావటి

పట్నంబజారు: విలక్షణ రాజకీయంతో.. విప్లవాత్మకమైన సంస్కరణలతో.. మొట్టమొదటి ముఖ్యమంత్రిగా మనరాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికై చిత్తశుద్ధితో కృషి చేసిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. స్వాతంత్య్ర సమరయోధులు రాష్ట్ర తొలి సీఎం ప్రకాశం పంతులు జయంతి వేడుకలు బుధవారం శంకర్‌విలాస్ సెంటర్‌లోని ప్రకాశం చౌక్ వద్ద ఆంధ్రకేసరి అభిమాన సంఘం నేతలు గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ అప్పి రెడ్డిని విశిష్ట సేవా పురస్కారంతో ఆంధ్రకేసరి అభిమాన సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టి వారాలు చేసుకుంటూ చదువుకుని ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడిగా టంగుటూరి ప్రకాశం పంతులు అని కీర్తించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్ఫూర్తితో దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో ప్రవేశించిన ప్పటికీ అవసరమైతే గాంధీనే ప్రశ్నించే రాజీలేని తత్వం ప్రకాశం పంతులు సొంతమన్నారు. ప్రతి తెలుగోడిలో స్వాతంత్య్రోద్యమ స్ఫూర్తిని రగిలించిన మార్గ దర్శకుడని, ఆయన త్యాగనిరతి అందరికీ ఆదర్శనీయమని, ఆయన ఆలోచనలను నిత్యం స్మరణ చేసుకుంటూ ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ నిబద్ధత, నిజాయితీగల నేత టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలోనే పదవుల కోసం కాక ప్రజల కోసం పరితపించిన పరిపాలనాదక్షుడిగా ప్రకాశం పంతులు ప్రజలందరి హృదయాలలో చెరగని ముద్ర వేశారన్నారు. మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ నేతగా టంగుటూరి ప్రకాశం పంతులు అని, దేశ స్వాతంత్య్రం కోసం తన సర్వస్వాన్ని నిస్వార్థంగా ధారపోసిన నిష్కళంక దేశభక్తుడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరరామశర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, మిర్చి యార్డు వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని, కార్పొరేటర్ షేక్ రోషన్, విజయమాధవి, ఐతి సతీష్, కాకి శ్రీను, రవి, పాల్గొన్నారు.

ఓటు హక్కు ఎంతో కీలకం

- పొందే హక్కు అర్హతగల ప్రతి వ్యక్తికి ఉంది
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- డోర్ టు డోర్ సర్వేలో అప్రమత్తంగా ఉండాలి
- ప్రజాప్రతినిధులు, బూత్ ఏజెంట్లు చెక్ చేసుకోవచ్చు

గుంటూరు వెస్ట్: ప్రజాస్వామ్య దేశానికి ఓటు హక్కు ఎంతో కీలకం.. దీనిని పొందే హక్కు అర్హతగల ప్రతి వ్యక్తికీ ఉందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల, ప్రజా ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా ప్రతి రోజూ బీఎల్‌ఓలు డోర్ టు డోర్ సర్వే చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికలకు పటిష్ట విధానాలతో పారదర్శకమైన ఓటర్ల జాబితాను తయారు చేయాలని పేర్కొన్నారు. డోర్ టు డోర్ సర్వేలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఓటర్ల జాబితా వెరిఫికేషన్లో రాజకీయ పార్టీల నాయకులు చెప్పిన అంశాలను అధికారులు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకమైన ఓటరు లిస్టుకు ప్రజలు సంపూర్ణ సహకారమందించాలని కోరారు. బీఎల్వోలు చేస్తున్న డోర్ టు డోర్ సర్వేలో ఏమైనా ఇబ్బందులుంటే రాజకీయ పార్టీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిశీలిస్తారన్నారు. వెరిఫికేషన్ సమయంలో ప్రజా ప్రతినిధులు, బూత్ ఏజెంట్లు పాల్గొని సక్రమమైన ఓటర్ల లిస్టులు తయారు చేసే విధంగా కృషి చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పకుండా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఒకే డోర్ నెంబర్‌పై సంఖ్యకు మించిన ఓటర్లు ఉంటే తొలగించాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌పై ఉన్న కుటుంబ సభ్యుల్లో కొందరికి ఒక పోలింగ్ బూత్ మరి కొందరికి మరో బూత్‌లో ఓట్లు ఉంటున్నాయన్నారు.దీన్ని సరిచేసుకోవాలని సూచించారు. మరణించిన వారి వివరాలు ఆయా కుటుంబ సభ్యులు బీఎల్వోలకు తెలపాలని కోరారు. రాజకీయ నాయకులకు ఎటువంటి అభ్యంతరాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర రావు, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, జిల్లా అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిదులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మంగళగిరి ఎయిమ్స్ అభివృద్ధికి అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ఎయిమ్స్ ముఖద్వారం వద్ద రహదారి విస్తరణకు అవసరమైన అటవీ భూములను సేకరించేందుకు అధికారులతో మాట్లాడుతున్నామన్నారు. ఇది త్వరలోనే పూర్తవుతుందని చెప్పారు. నీటి సరఫరా మంజూరు కోసం వాటర్ వర్క్స్ శాఖ వేస్తున్న పైప్‌లైన్ పనులు కొంచెం పెండింగ్‌లో ఉన్నాయని దీనిని కూడా పూర్తి చేస్తామని చెప్పారు. నాడు–నేడులో భాగంగా పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనను నిరంతరం పరిశీలిస్తున్నామన్నారు.

నార్త్‌జోన్ జట్టుపై సౌత్‌జోన్ విజయం

ఉత్కంఠభరితంగా ఏసీఏ సీనియర్ ఉమెన్ ఇంటర్‌జోనల్ వన్డే మ్యాచ్‌లు



5 వికెట్లు పడగొట్టిన సౌత్‌జోన్ బౌలర్ జి.చంద్రలేఖ



60 పరుగులు సాధించిన నార్త్‌జోన్ బ్యాటర్ ఎ.శిరీష

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నవులూరు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన ఏసీఏ సీనియర్ ఉమెన్ ఇంటర్‌జోనల్స్ వన్డే మ్యాచ్‌లో నార్త్‌జోన్ జట్టుపై సౌత్ జోన్ జట్టు 55 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచిన నార్త్‌జోన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుని సౌత్‌జోన్ జట్టుకు బ్యాటింగ్ అప్పగించగా 48.3 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. జట్టు బ్యాటరు ఎ.శిరీష 113 బంతుల్లో 3 ఫోర్లతో 60 పరుగులు సాధించగా మరో బ్యాటరు కె.హంస 79 బంతుల్లో 3 ఫోర్లతో 42 పరుగులు సాధించింది. నార్త్ జోన్ బౌలర్ కె.జ్యోతి 10 ఓవర్లలో 39 పరుగులిచ్చి 3 వికెట్లను పడగొట్టింది. అనంతరం 191 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన నార్త్‌జోన్ జట్టు 45.1 ఓవర్లలో 135 పరుగులకే కుప్పకూలింది. జట్టు బ్యాటరు ఎం.దుర్గ 73 బంతుల్లో 27 పరుగులు సాధించింది. సౌత్ జోన్ బౌలర్ జి.చంద్రలేఖ 8.1 ఓవర్లలో 18 పరుగులిచ్చి 5 వికెట్లను పడగొట్టింది.

అభయమిచ్చారు.. అన్నలా ఆదుకున్నారు

- ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన భర్త
- సీఎం వైఎస్ జగన్‌ను కలిసి సమస్యను వివరించిన మహిళ
- సీఎం సహాయ నిధి నుంచి రూ.7.50 లక్షలు విడుదల
- ఆనందం వ్యక్తం చేస్తున్న దంపతులు



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

తాడేపల్లిరూరల్: కుటుంబానికి ఆధారమైన వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై వైద్యానికి డబ్బులు లేక అప్పులు చేసి మంచానికే పరిమితమవడంతో తమను ఆదుకోవాలంటూ ఓ మహిళ బాధను విన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థికసాయం అందించాలంటూ కలెక్టర్‌ను ఆదేశించారు. బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అందజేయడంతో సదరు మహిళ, కుటుంబ సభ్యులు ఆనందంతో కంటతడి పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. దుగ్గిరాల గ్రామానికి చెందిన ఒడుగు నాగూర్ ప్రకాశం జిల్లా చీమకుర్తిలో ఓ రైస్‌మిల్‌లో పనిచేస్తూ దుగ్గిరాలలో వున్న తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నెలలో రైస్‌మిల్లు నుంచి భోజనానికి రోడ్డుమీదకు వచ్చిన నాగూర్‌ను ఓ ట్రాక్టర్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు నాగూర్‌ను ఆసుపత్రిలో చేర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న నాగూర్ మంచానికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పేదలందరికి ఇళ్లు శంకుస్థాపను వస్తున్నారని తెలుసుకున్న నాగూర్ భార్య యశోద సీఎం సభలో ఆయన స్టేజీమీద ప్రజలకు అభివాదం చేస్తుండగా ఎక్కడో జనాల మధ్య వున్న యశోద జగనన్నా నీతో మాట్లాడాలి అన్నా.. అంటూ చేతుల ఊపుతూ సైగలు చేయడంతో తన వ్యక్తిగత సిబ్బందిని పంపించి ఆమెను వేదికపైకి పిలిపించారు. వెంటనే తన భర్త ఆరోగ్య పరిస్థితి వివరించడంతో ఆదుకుంటామని తన దగ్గర ఉన్న అర్జీలను తీసుకుని కలెక్టర్‌కు అందజేశారు. ఈక్రమంలో నెల రోజుల వ్యవధిలోనే తమ కుటుంబానికి సీఎం సహాయ నిధి కింద రూ.7.50 లక్షలను జగనన్న పంపించారని యశోద కన్నీళ్ల పర్యంతమైంది. అయినవాళ్లే దూరంపెట్టిన తమకు సొంత అన్నలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభయమిచ్చి, ఆదుకున్నారని తెలిపారు. ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ, సర్పంచ్ బాణావత్ కుషీబాయి పాల్గొన్నారు.

పాఠశాల బస్సు బోల్తా

ఇద్దరికి స్వల్ప గాయాలు



దాచేపల్లి: ప్రమాదవశాత్తూ ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తాపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఇద్దరు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. కేశానుపల్లిలో ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు 36 మంది విద్యార్థులతో పెదగార్లపాడు వెళ్తోంది. దాచేపల్లి మండలం తక్కెళ్లపాడు గ్రామ సమీపంలో రోడ్డు మార్జిన్ దాటే క్రమంలో బస్సు అదుపు తప్పి బస్సు బోల్తాపడింది. బస్సు డ్రైవర్, క్లీనర్‌లు అప్రమత్తమై విద్యార్థులను క్షేమంగా బయటకు తీశారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

నలిగిన చేతివేళ్లను సరిచేశారు

జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీలో కాస్మోటాలజీ వైద్యసేవలు



ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ నిషాంత్ సాధనాల

గుంటూరు మెడికల్: పనిచేస్తున్న ప్రదేశంలో పెద్దరాయి చేతిపై పడి చేతివేళ్లు నుజ్జు నుజ్జు అయిన వ్యక్తికి గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు అత్యాధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్ చేసి చేతివేళ్లను సరిచేశారు. నీలాంబరం అనే 55 ఏళ్ల వ్యక్తి కూలిపనికి వెళ్లి పనిచేస్తున్న ప్రదేశంలో కుడిచేతిపై పెద్దరాయి పడటంతో కుడిచేతికున్న మూడు వేళ్ల ఎముకలు విరిగిపోయి నుజ్జునుజ్జు అయ్యాయి. గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగానికి మూడు రోజుల క్రితం బాధితుడు వచ్చాడని సీనియర్ రెసిడెంట్ డాక్టర్ సాధనాల నిశాంత్ చెప్పారు. చేయి బాగా వాచిపోయి ఉండటంతో రెండురోజులపాటు అడ్మిషన్‌లో ఉంచి చికిత్స అందించామన్నారు. బుధవారం హ్యాండ్ సర్జరీ డేను పురస్కరించుకుని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సుమారు రూ.లక్ష ఖరీదు చేసే ఆపరేషన్‌ను నీలాంబరంకు పూర్తి ఉచితంగా చేశామన్నారు.

పూర్తి ఉచితంగా ప్లాస్టిక్ సర్జరీ సేవలు..

ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగంలో కాస్మోటాలజీ వైద్యసేవలను సైతం పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. కొట్లాటల్లో, ప్రమాదకరమైన మెషిన్ల వద్ద పనిచేస్తున్న సమయంలో, అగ్ని ప్రమాదాల్లో, రోడ్డు ప్రమాదాల్లో చేతులు, చేతివేళ్లు తెగిపోయినా గుంటూరు జీజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. విరిగిపోయిన, నలిగిపోయిన చేతివేళ్లను, వంకరపోయిన వాటిని, తెగిపోయిన వాటిని సైతం సరిచేస్తున్నామన్నారు. పుట్టుకతో అతుక్కుపోయిన చేతివేళ్లను సైతం ఆపరేషన్ చేసి సాధారణ స్థితికి తెస్తున్నామన్నారు. వేలు తెగినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. తెగిన వేళ్ల వల్ల చేతి పనితీరులో పలు సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. తెగిపోయిన వేలి భాగాన్ని బాధితులు వెతికి తీసుకురావటం, లేదా ఇతరులకు చెప్పి వెతికించి ఆస్పత్రికి అంబులెన్స్‌లో త్వరగా తరలించటం ద్వారా ఉపయోగం ఉంటుందని తెలిపారు. తెగిన వేలి గాయం వద్ద సెలైన్ వాటర్‌తో శుభ్రం చేసుకుని శుభ్రమైన గాజుగుడ్డ, డ్రెస్సింగ్‌తో తేలికగా గాయాన్ని కప్పిఉంచాలన్నారు. రక్తస్రావం ఆపటానికి కొంచెం ఒత్తి ఉంచాలని, రక్తస్రావం, వాపును తగ్గించేందుకు గాయపడిన చేతిని గుండెపైకి ఎత్తి ఉంచాలని సూచించారు. తెగిన వేలిని నేరుగా ఐస్ ముక్కలపై పెట్టకుండా తడి లేకుండా చల్లగా ఉంటే సంచిలో చుట్టుకుని వైద్యుల వద్దకు తీసుకురావాలని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ వైద్య విభాగానికి అత్యాధుని వైద్య పరికారాలు అందించటం వల్ల కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా మెరుగైన వైద్యసేవలను పూర్తి ఉచితంగా పేదలకు అందిస్తున్నామన్నారు.

ప్రగతి లక్ష్యాలు చేరుకోవాలి

పల్నాడు కలెక్టర్ శివశంకర్

సత్తెనపల్లి: ప్రగతి లక్ష్యాలను చేరుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగంతో సత్తెనపల్లిలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణాలు, ఎస్‌డీజీస్, విద్యాశాఖకు సంబంధించిన నాడు– నేడు నిర్మాణ పనులు, జేకేసీ, జీజీఎంపీ, పీఎం విశ్వకర్మ ఇంటర్‌డక్షన్, వైఎస్సార్ ఎక్సెలెన్స్ అవార్డులు తదితర అంశాల పై వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించి పురోగతి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి, ఆర్డీఓ బీఎల్ఎస్ రాజకుమారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

అద్దంకి: అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తీసుకుంటామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. ఆమె గురువారం పట్టణంలోని అంగన్‌వాడీ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ ఎలా ఉంది.. పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ బత్తుల వారి పాలెం సెంటర్‌లో గుడ్లను అందించడం లేదని, మరుగుదొడ్డి సౌకర్యం లేదని గుర్తించారు. సెంటర్‌ను మార్చాలని ఉమెన్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలపై పూర్తిస్థాయి నిఘా ఉందని, ఎక్కడ అవకతవకలు జరిగినా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఓఆర్‌డబ్ల్యూ, డీసీపీయూ శామ్యూల్ రాజ్ పాల్గొన్నారు.



ఆచంద్ర తారార్కం

ఈ మహిళల కీర్తి

'ఇస్రో'లో పనిచేసిన తొలి తరం మహిళా శాస్త్రవేత్తల మాటల్లో తరచు వినిపించే మాట... 'ఆరోజుల్లో ఇస్రోలో చా...లా తక్కువ మంది మహిళలు ఉండేవారు'
చంద్రయాన్-3కి సంబంధించి నిన్నటి ప్రత్యక్ష ప్రసారాన్ని గమనిస్తే... ఆ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉత్సాహంగా కనిపిస్తారు.
మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.
అది సంఖ్యాబలమే కాదు సామర్థ్య బలం కూడా.
'ఇస్రో' సాధించిన ఎన్నో విజయాలలో మహిళా శాస్త్రవేత్తలు భాగం అయ్యారు.
ముఖ్యంగా 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్‌లో రీతూ కరిధాల్ నుంచి కల్పనా కాళహస్తి వరకు ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు మేధోశ్రమ చేశారు. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు.
'ఇస్రో సైంటిస్ట్ కావాలనుకుంటున్నాను' అని కలలు కనే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే అసాధారణ విజయ గాధలు ఇవి.

రాకెట్ ఉమన్: రీతూ కరిధాల్



అన్ని దశలను పూర్తి చేసుకొని విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన క్షణం ఒక చారిత్రక సందర్భం. ఎంత కృషి చేస్తే ఒక విజయం సొంతం అవుతుందో చెప్పిన సందర్భం.

అమోఘమైన చారిత్రక విజయాన్ని దేశానికి అందించిన 'చంద్రయాన్-3'లో భాగమైన అనేకమంది మహిళలలో రీతు కరిధాల్ ఒకరు.

గత నెలలో...

మూడు దశలను పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి దూసుకెళ్లిన తరువాత ఉత్తర్‌ప్రదేశ్‌లో లక్నోలోని ఒక ఇంట్లో ఆనందం అంబరాన్ని తాకింది. వారు ఆనందంతో బాణాసంచా కాల్చారు. మిఠాయిలను చుట్టుపక్కల వారికి పంచారు. ఇక నిన్నటి రోజు ఆ ఆనందం స్థాయి ఎల్లలు దాటి ఉండవచ్చు. ఇది కోట్లాదిమంది భారతీయుల ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యమే కావచ్చు.

కాని ఆ ఇంటికి ఒక ప్రత్యేకత ఉంది.

ఆ ఇంట్లో పుట్టిన రీతూ కరిధాల్ ప్రసిద్ధ చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు ఆకాశం అంటే అంతులేని ఆసక్తి. అదేపనిగా నింగిలోకి చూసేది. ఏవేవో ఊహించుకునేది. అప్పటికి అవి శాస్త్రీయతకు నిలవని ఊహలు కావచ్చు. అయితే రీతూ కరిధాల్ శాస్త్రీయ రంగంలో దిగ్గజంగా వెలగడానికి ఉపకరించిన ఊహలు.

కట్ చేస్తే....

1997... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోకి అడుగు పెట్టింది రీతు. చంద్రుడిపై అడుగు పెట్టినంత ఆనందంగా అనిపించింది. 'ఇస్రో' గురించి వింటూ, చదువుతూ పెరిగిన రీతు అదే 'ఇస్రో'లో 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో ఉద్యోగిగా చేరింది. అప్పట్లో 'ఇస్రో'లో తక్కువ మంది మహిళలు పనిచేసేవారు.

ఎక్కడికి వెళ్లినా ఒంటరిగానే వెళ్లేది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది.

అయినా సరే, ఎప్పుడూ భయపడేది కాదు.

అసలు సిసలు భయం మాత్రం తొలి టాస్క్ రూపంలో ఎదురైంది.

'నేను చేయగలనా?' అని మొదట ఆందోళన పడింది రీతు.

చేతులెత్తేయడం తేలిక. 'చేయగలను' అనుకోవడం కష్టం. అయితే కష్టపడే వారే విజేతలవుతారు. 'యస్ నేను చేయగలను' అంటూ తొలి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేసి 'భేష్' అనిపించుకుంది.

'నాకు అప్పగించిన టాస్క్‌ను సీనియర్‌లు చేసే అవకాశం ఉన్నప్పటికీ నన్ను వెదుక్కుంటూ వచ్చింది. ఇది నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అదృష్టవశాత్తు వచ్చిందా? అనేది తెలియదుగానీ నా విజయానికి కారణం... ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ చదువుకున్నాననే ధైర్యం కంటే నాపై నాకు ఉన్న ఆత్మవిశ్వాసం' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది రీతు.

ఆ ఆత్మవిశ్వాసం అప్పుడే కాదు ఇప్పటికీ రీతు వెన్నంటే ఉంది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రతిష్ఠాత్మకమైన 'మంగళయాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేయడానికి ఇంధనంగా మారింది. చంద్రయాన్-3తో రీతూ కరిధాల్ ఒక చారిత్రక విజయంలో భాగం అయింది.

శాస్త్రవేత్తలు కావాలనుకునే కలలు కనే అమ్మాయిలకు రీతు కరిధాల్ స్ఫూర్తి ఇస్తుంది.

'నా విజయ మంత్రం ఇది' అని ఆమె ఎప్పుడూ ప్రత్యేకంగా చెప్పలేదుగానీ పరోక్షంగా వినిపించే మాట...టైమ్ మేనేజ్‌మెంట్.

కాలం విలువ తెలిసిన వారే 'టైమ్ మేనేజ్‌మెంట్'ను ఇష్టంగా ఆచరిస్తారు. ఆ ఆచరణే ఎన్నో విజయాలను బహుమానంగా ఇస్తుంది.

స్ఫూర్తిదాయక శక్తిమంతులు


● మహిళా శాస్త్రవేత్తలు, సిబ్బంది వేడుక

స్పేస్ మిషన్‌లలో భాగమైన మహిళా శాస్త్రవేత్తల గురించి మిన్నీ వేద్ 'దోజ్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ స్టోరీస్' అనే స్ఫూర్తియదాయకమైన పుస్తకాన్ని రాసింది. ఈ పుస్తకంలో 'రాకెట్ ఉమెన్'గా పేరు గాంచిన రీతూ కరిధాల్ సక్సెస్ స్టోరీ కూడా ఉంది. 'కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాను. వృత్తిపరమైన విజయాలకు కుటుంబమే పెద్ద బలం' అంటుంది రీతు.

'ఇస్రో'లో రీతులాగే ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. అయితే ఇది రాత్రికి రాత్రి వచ్చిన విజయం కాదని వారి ప్రయాణాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'ఇస్రో'లో పనిచేయాలని అనుకోవడానికి కారణం నుంచి... ఎదుర్కొన్న ఒత్తిళ్ల వరకు వారి మాటల్లో కనిపిస్తాయి.

ఇస్రో స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేసిన సీతా సోమసుందరం ఇలా అంటోంది...

'నేను ఇస్రోలో చేరిన కాలంలో ఇంజినీరింగ్, సైన్స్‌లలో మహిళలు చాలా తక్కువ మంది ఉండేవాళ్లు. కొందరు సీనియర్‌లకు కొన్ని అభిప్రాయాలు ఉండేవి. అందులో ఒకటి... మహిళలు ఎక్కువగా కష్టపడలేరు. పరిమిత పని గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అంకితభావం ఉండదు. అయితే ఇది తప్పుడు భావన అని ఇస్రోలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు నిరూపించారు'. 'ఏదో ఉద్యోగం చేస్తున్నాను అనే భావన కాకుండా విజయంలో భాగం కావాలనే సంకల్పబలం మహిళా శాస్త్రవేత్తలలో కనిపిస్తుంది. ఎన్నో విజయాలలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. డెడ్ లైన్‌లను సవాలుగా తీసుకోవడం నుంచి మిషన్, నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్, ట్రాకింగ్ లాంటి మేజర్ ఏరియాలలో కీలక పాత్ర పోషించి తమ సత్తా చాటారు' అంటుంది మంగళ్‌యాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన ఎస్.అరుణ. స్పేస్ సైంటిస్ట్‌లు అనగానే ఏవో గంభీరమైన ఊహలు తారసపడతాయి. అయితే ఈ ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల మాటలు విన్న తరువాత 'అందరిలాగే సాధారణ జీవితం... కానీ అసాధారణ సంకల్ప బలం' అనే సత్యం ఆవిష్కారం అవుతుంది. 'ఇస్రోకు చైర్ ఉమన్ (చైర్ పర్సన్) ఎప్పుడూ?' అనే ప్రశ్న వస్తుంటుంది. 'ఇస్రో' విజయాలలో భాగం అవుతున్న మహిళల అంకితభావాన్ని చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదు' అనిపిస్తుంది. 'ఇస్రో'లో జెండర్-న్యూట్రల్ ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ ఉంటుందనే మంచి మాటలు కూడా దీనికి కారణం.

కొన్నిసార్లు లోతైన భావాలు పలకడానికి పదాలు, పుస్తకాలు తెల్లముఖం వేస్తాయి. కళ్లు మాత్రమే నిశ్శబ్దంగా చెబుతాయి. చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు సంబంధించి నిన్నటి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో మహిళా శాస్త్రవేత్తల కళ్లలో కనిపించిన ఉత్సాహాన్ని, అంకితభావాన్ని గమనిస్తే ఇంకా ఎన్నో విజయాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయని అనిపిస్తుంది.

సంతోష క్షణాలు: కల్పనా కాళహస్తి



కల్పనా కాళహస్తిది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. చెన్నైలో బి.టెక్ (ఈసీఈ) చదివారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. ఇస్రోలో పనిచేయాలని తన చిన్ననాటి నుంచి కలలు కనేది. అనుకున్నట్టుగానే 2000 సంవత్సరంలో ఇస్రోలో చేరారు. తొలుత శ్రీహరికోటలో ఐదేళ్లు పనిచేశాక బెంగళూరులోని శాటిలైట్ సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరోనా పాండమిక్ సమయంలో అనేక అవాంతరాలు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ 'చంద్రయాన్-3' మిషన్‌లో అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె గతంలో చంద్రయాన్-2, మంగళయాన్ ప్రాజెక్టుల్లోనూ కీలక బాధ్యతల్ని నెరవేర్చారు. ఆమె నైపుణ్యం, అంకితభావం, దూరదృష్టి వంటివి మిషన్ విజయవంతం కావడంతో గణనీయంగా తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇవి చాలా సంతోషభరితమైన క్షణాలుగా ఎప్పటికీ ఉండిపోతాయి. చంద్రయాన్ 2 కాలం నుంచి లభ్యమైన ఎన్నో అనుభవాలతో ఈ మిషన్‌ను లోప రహితంగా రూపొందించాం అని చెప్పారు.

వినిపించే గొంతుక: పి.మాధురి



శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నుంచి ప్రజలకు బయటికి కనపడే అక్కడి సిబ్బంది/ సైంటిస్టుల్లో పిల్లల మాధురి ఒకరు. ఈమె షార్‌లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాకెట్ లాంచింగ్ సమయంలో వినిపించే వ్యాఖ్యానాలు, ప్రజలకు వివరించే అంశాల గొంతుక ఆమెదే.

వీళ్లే కాకుండా చంద్రయాన్-3 మిషన్‌లో మొత్తం 54 మంది మహిళా సైంటిస్టులు / ఉద్యోగులు / సిబ్బంది ఉన్నారు. వీళ్లలో చాలా మంది మహిళలు ఎంతో కీలకమైన బాధ్యతలు నెరవేర్చే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయి నుంచి అనేక స్థాయుల్లో పనిచేస్తూ... కీలకమైన, భారత్‌కు గర్వకారణమైన ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు.

సౌమ్యంగా సాధించింది

సౌమ్య ఈ తరం టెకీ. సాంకేతికతను ఆరోగ్యానికి అద్దింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో కొత్త ఒరవడి తెచ్చింది.



వైద్యరంగం, ఔషధాల తయారీ రంగాలు సాంకేతికతను అందుకోవాల్సినంత వేగంగా అందుకోవడం లేదనుకుంది సౌమ్య. 'మల్టిప్‌లెయిర్ ఏఐ' పేరుతో హెల్త్‌కేర్ రంగంలో ప్రవేశించింది. ఇంత సునిశితమైన, సంక్లిష్టమైన పరిశ్రమను నిర్వహించడం మగవాళ్లకే సాధ్యం అనే అభిప్రాయాన్ని చెరిపేసిందామె. 'మగవాళ్ల ప్రపంచం అనే భావన మహిళలు ప్రవేశించేటంత వరకే. ఒకసారి మహిళలు ప్రవేశిస్తే ఇక అది అపోహ మాత్రమేనని నిర్ధారణకు వచ్చేస్తాం. మా టీమ్ లో సగానికి పైగా మహిళలే. సేల్స్ విభాగంలో కూడా మహిళలు సమర్థంగా పని చేస్తున్నార'ని చెప్పింది. ఒక టెకీ హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితులను, హైదరాబాద్‌లో సంస్థ స్థాపించి సక్సెస్ అందుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు సౌమ్య.


● సౌమ్య

భారీ మూల్యం చెల్లించాం

''నన్ను హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి రప్పించిన కారణాలు అత్యంత బాధాకరమైనవి. మాది ఉత్తరప్రదేశ్, ప్రయాగరాజ్ (అలహాబాద్). నాన్న రవిప్రకాశ్ శ్రీవాస్తవ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న డయాబెటిస్‌తో బాధపడుతుండేవారు. రొటీన్ టెస్టులు, మెడికేషన్ ఇవ్వడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. మా జీవితాలు భారీ మూల్యం చెల్లించుకున్న పొరపాటు అది. వైద్యుల నిర్లక్ష్యం, రాంగ్ మెడికేషన్ కారణంగా ఆయన హఠాత్తుగా ప్రాణాలు వదిలారు. నేనప్పుడు బీటెక్ సెకండియర్‌లో ఉన్నాను. ఆ తర్వాత కొద్దిసంవత్సరాల్లోనే అమ్మకు ఒవేరియన్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. మేము తెలుసుకునేటప్పటికే వ్యాధి మూడవ దశకు చేరింది. చికిత్స మొదలు పెట్టినప్పటికీ ఆరు నెలలకే అమ్మను కూడా కోల్పోయాను. అలాంటి దయనీయమైన పరిస్థితుల్లోనే బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో బయోటెక్నాలజీలో మాస్టర్స్ చేశాను. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ వైద్యరంగం ఆ వేగాన్ని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోంది. ఆ వెనుకబాటు తెచ్చిన నష్టంలో మా అమ్మానాన్నల మరణాలు కూడా భాగమేననిపించింది. ఈ రెండు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలనే సంకల్పం కలిగింది, చేయగలననే నమ్మకం కూడా. సమాచారలోపం తలెత్తని విధంగా మెడికల్ డాటాను పరిరక్షించగలిగే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నాను. మల్టిప్‌లెయిర్ ఏఐ స్థాపించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా డాటా అనలైజేషన్, డాటా మెయింటెయిన్ చేస్తున్నాం. మా సంస్థకు 'ఐఎస్ఓ 27001' సర్టిఫికేట్ వచ్చింది. మా సర్వీస్‌ను దేశవిదేశాల్లో పెద్ద ఆరోగ్య సంస్థలు తీసుకుంటున్నాయి. పేషెంట్ కేర్‌లో మొదటిది పేషెంట్ ఆరోగ్య చరిత్ర, క్రమం తప్పని పరీక్షల ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల నివేదికల నిర్వహణ ప్రధానమైనవి. ఇక్కడ పొరపాటు జరిగితే ప్రాణాలు దక్కవని చెప్పడానికి మా పేరెంట్సే ఉదాహరణ.

ఫాలో అప్ సర్వీస్

వ్యాధి నిర్ధారణ ఆధారంగా వైద్యం అందించిన తర్వాత తదనంతర పరీక్షలను, వైద్యాన్ని అందించాల్సిన సమయానికి ఫాలో అప్ చేయడం కూడా మా సర్వీస్‌లో భాగంగా ఉంది. అలాగే భవిష్యత్తులో టెలిమెడిసిన్ విస్తరించాల్సిన అవసరం ఉంది. వైద్యచికిత్సను కుగ్రామాలకు చేరడానికి చక్కటి మాధ్యమం ఇది. పేషెంట్‌ను ఉన్న చోటనే ఉంచి ఆరోగ్యపరిస్థితిని మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. నేను చదివిన టెక్, బయోటెక్ పరిజ్ఞానం ఇందుకు దోహదం చేసింది. నాకు సవాళ్లు ఎదురయ్యాయా అంటే సవాళ్లు లేని ప్రొఫెషన్ అంటూ ఏదైనా ఉంటుందా? డిజిటల్ బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవరోధాలు వచ్చాయి. మా క్లయింట్ల సందేహాలను తీరుస్తూ, వాళ్లు సమాధానపడే వరకు సహనంగా వివరించాం. సవాళ్లకు సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవడమే సక్సెస్‌కు దారి తీస్తుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మా నాన్నను కోల్పోవడమే నన్ను ఈ రంగం వైపు నడిపించింది. ప్రతి విజయంలో మా అమ్మానాన్న కనిపిస్తున్నారు'' అని వివరించారు సౌమ్య.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అందంగా పెంచుకుందాం!

బ్యూటిప్స్





గోళ్లు ..పొడవుగా అందంగా ఉండే ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. కానీ కొందరిలో కొద్దిగా పెరగగానే విరిగిపోతుంటాయి. కొంతమందికి అసలు పెరగవు. దీంతో నెయిల్ పెయింట్ వేసుకోవాలంటే ఇబ్బంది. గోళ్లను చక్కగా పెంచే ఈ ఐదు చిట్కాలు పాటించి చూడండి మీ కోరిక తీరుతుంది..

- గోళ్ల పెరుగుదలను ప్రోత్సహించడంలో ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఇ గోళ్లకు పోషణ అందించి చక్కగా పెరిగేలా చేస్తుంది. రాత్రి పడుకోబోయే ముందు కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను గోళ్లమీద రాసి మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ చక్కగా జరిగి గోళ్లలో పెరుగుదల కనిపిస్తుంది.
- టీస్పూను యాపిల్ సైడర్ వెనిగర్‌లో టీస్పూను వెల్లుల్లి తరుగు వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లపై రాసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే గోళ్లు విరగకుండా చక్కగా పెరుగుతాయి.
- వెల్లుల్లి రెబ్బను రెండు ముక్కలు చేసి గోళ్లపై పదినిమిషాలపాటు రుద్దాలి. కొద్దిరోజుల్లోనే గోళ్ల పెరుగుదల కనిపిస్తుంది.
- ఆరెంజ్ జ్యూస్‌ను గోళ్లకు పూతలా అప్లైచేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది గోళ్లను అందంగా పెరిగేలా చేస్తుంది.
- ఇవన్నీ చేయలేకపోతే కొబ్బరినూనెను గోళ్లపై రాసి రోజూ మర్దన చేయాలి. కొబ్బరినూనెలోని ఫ్యాటీ ఆమ్లాలు, ఇతర పోషకాలు గోళ్ల పెరుగుదలకు దోహదపడతాయి.

ఇంటిప్స్







- ఒక్కో నిమ్మకాయను అల్యూమినియం ఫాయిల్‌ల్లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- శాండ్ విచ్ మరీ మెత్తగా కాకుండా చక్కగా రావాలంటే... శాండ్ విచ్‌లో పెట్టే కూరగాయలు, బ్రెడ్ మయనేజ్, చీజ్ గది ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇంతకు మించి వేడిగా ఉండే తేమ చేరి శాండ్ విచ్ మెత్తగా మారిపోతుంది.
- కొన్నిసార్లు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత గట్టిగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత చల్లని నీటిలో ఐదు నుంచి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కూరలో వేస్తే పన్నీర్ ముక్క మృదువుగా, మెత్తగా ఉంటుంది.

అబద్ధాలను నమ్ముతున్నారా?!

సైబర్ టాక్



నిజం నిలబడి ఉండగానే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందంటారు.. ఈ సామెత సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా పుట్టుకువచ్చే ఫేక్‌న్యూస్ విషయంలో సరిగ్గా సరిపోలుతుంది. ఈ ఫేక్ న్యూస్ వల్ల నిజమేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. అబద్ధాన్ని నిజం అనుకునే ప్రమాదమూ ఉంటోంది. అలాగే.. ఫొటోలు, వీడియోలు కూడా ఫేక్‌వి పుట్టుకొస్తున్నాయి. లైవ్ వీడియోలోనూ ఇటీవల ఏఐ టెక్నాలజీ ద్వారా అబద్ధం కొత్తగా సోషల్‌మీడియాను ఏలుతోంది. నిజమేంటో తెలుసుకోవడానికి మనం చాలా ప్రయత్నాలు చేయాల్సి ఉంటోంది. ఎందుకంటే, అబద్ధాల వల్ల కలిగే మోసాలు ఎన్నో. వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా నిజాలేమిటో తెలుసుకుందాం...

వార్తలకు సంబంధించిన సమాచారం, డేటా, నివేదికలు పూర్తిగా నిజమైనవి కానివి ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకని, మూలాధారాలు లేకుండా వచ్చిన సమాచారం అవాస్తవం అని గ్రహించాలి. అబద్ధపు వార్తలు విస్తృతంగా షేర్ అవుతుంటాయి. వీటికి ఎలాంటి సెన్సార్‌షిప్ ఉండదు.

నకిలీ వార్తల పుట్టుకకు..

తమకు తెలిసిన విషయాన్ని నలుగురికి తెలియజేయాలనే ఆత్రుత. స్వీయ లాభం, రాజకీయ ప్రభావం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. కేవలం తమకు తెలిసినవి మరికొందరికి తెలియజేద్దామని నిజానిజాలు తెలుసుకోకుండా కొందరు అదేపనిగా షేర్ చేస్తుంటారు. సమాచారం అబద్ధమే కావచ్చు కానీ, దానిని షేర్ చేసే వ్యక్తి అది నిజమని నమ్ముతారు. తప్పుడు సమాచారం అని తెలిసీ ఉద్దేశపూర్వకంగానే షేర్ చేస్తారు. ఏదైనా సమస్యకు లేదా వ్యక్తికి సంబంధించిన కంటెంట్ అబద్ధమైతే మనల్ని ఆ వార్త తప్పుదారి పట్టించవచ్చు. ముఖ్యాంశాలు, విజువల్స్, క్యాప్షన్‌లు కంటెంట్‌కు సరిపోని విధంగా ఉంటాయి. మోసగించడానికి ఫొటోలు, కంటెంట్‌ను తారుమారు చేస్తుంటారు.

తనిఖీ చేసే విధానం..

- వీడియో మూలం ఎక్కడ ఉందో చెక్ చేయాలి. అది విశ్వసనీయమైనదే అని నిర్ధారించుకోవడానికి ప్రయత్నించాలి.
- సమాచారం నిజమైనదైనా ప్రత్యామ్నాయంగా ఇతర మూలాధారాల కోసం వెతకాలి.
- వీడియోలో అసహజమైన కదలికలు ఉన్నాయేమో గమనించాలి.
- డీప్ ఫేక్స్ గుర్తించడానికి 'డీప్ ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి స్పెషల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది.
- వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా? ఆ వీడియో ఏ సందర్భాన్ని బట్టి తీశారో ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.
- వీడియోలో ఉన్న వ్యక్తిని మెయిల్, ఫోన్ ద్వారా సంప్రదించి, ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

వాస్తవం తెలుసుకోవాలంటే..

- గూగుల్ రివర్స్ ఇమేజ్ చెక్ చేయాలి. లేదా ఫొటో వెరిఫికేషన్ కోసం www.tineye.comని ఉపయోగించాలి.
- ఫొటో లేదా వీడియో (https://www.invid-project.eu/tools-and-services/invid-verification-plugin/) కోసం ఇన్‌విడ్ టూల్‌కిట్ ఎక్స్‌టెన్షన్‌ని ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫార్వర్డ్ చేసే ముందు ఏదైనా ఒక అంతర్జాతీయ ఫాక్ట్-చెకింగ్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్‌తో www.factly.in వాస్తవాన్ని చెక్ చేయాలి.

ఇలా గుర్తించాలి...

డీప్ ఫేక్ వీడియో లేదా ఆడియోలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో జాగ్రత్తగా పరిశీలించడం, వినడం చేయాలి.

- డీప్ ఫేక్ వీడియో లేదా ఫొటోలలో లైటింగ్ నీడలను చెక్ చేయాలి. కొన్నింటిలో నీడలు కచ్చితంగా కనిపించకపోవచ్చు. ఇవే కాకుండా ఇంకేమైనా లోపాలు ఉన్నాయేమో చెక్ చేయాలి.
- వీడియోలలోని బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలి. సబ్జెక్ట్‌కు వీడియోలోని వ్యక్తుల కదలికల సరిపోలకపోవచ్చు. అంటే, ఏఐ టెక్నాలజీ ద్వారా నకిలీ వ్యక్తుల సృష్టి అయి ఉండవచ్చు.
- వీడియోలో వ్యక్తి కనురెప్పలు ఆర్పుతున్నారో లేదో పరిశీలించాలి.
- లైవ్ వీడియోలో మాట్లాడుతున్నప్పుడు ముఖాన్ని ఎడమ లేదా కుడికి కదిలించమని సదరు వ్యక్తిని ఉద్దేశించి అడగాలి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్